సాక్షి
అనకాపల్లి
శుక్రవారం, 24, నవంబర్, 2023



హాస్టళ్లకు కొత్త రూపు

విశాఖ: ఆధునికీకరించిన ఏయూ సైన్స్ కళాశాల విద్యార్థినుల వసతిగృహం విద్యా ప్రగతి భవన్‌ను వీసీ ప్రసాదరెడ్డి ప్రారంభించారు.



యార్లగడ్డకు ఆభరణం

విశాఖ: యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ధన్యజీవి అని మాజీ వీసీ బాలమోహన్‌దాస్ అన్నారు. యార్లగడ్డ 70వ జన్మదినోత్సవంలో పాల్గొన్నారు.



బల్లిగిరికి పోటెత్తిన భక్తులు

విశాఖ: కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి గురువారం భక్తులు పోటెత్తారు.

సంద్రమంత సంబరం





మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు, చిత్రంలో మంత్రి అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గురువులు,ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, జేసీ విశ్వనాథన్ (ఇన్‌సెట్) ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న మత్స్యకార సంఘ నాయకులు

నిన్న మొన్నటి దాకా వారి కళ్లల్లో నీళ్లు సుడులు తిరుగుతూ కనిపించాయి. తమ బతుకులు ఏమవుతాయోనని వారి ముఖాల్లో భయాందోళనలు గోచరించాయి. కూడు పెట్టే నావలు బుగ్గిపాలయ్యాయంటూ వేదన చెందారు. గత ప్రభుత్వాల నిర్వాకాన్ని గుర్తుకు తెచ్చుకుని ఇక తమకు అథోగతేనంటూ రేయింబవళ్లు రోదించారు. పట్టించుకునే వారే ఉండరని కుమిలిపోయారు. అయితే ఆవేదన, ఆందోళన కేవలం మూడు రోజులకే ముగిసిపోయింది. వాటి స్థానంలో సంతోషం వెల్లువెత్తింది. ఊహించని విధంగా సర్కారు ఆదుకుంది. ఊహకు మించి సాయాన్ని అందించింది. బాధిత మత్స్యకారుల కళ్లల్లోనూ, ఇళ్లల్లోనూ సంద్రమంత సంబరాన్ని నింపింది.

- ఊహించిన దానికన్నా మిన్నగా పరిహారం
- మూడు రోజుల్లోనే చెక్కులు అందజేత
- ఒక్కొక్కరికి రూ.2.40 లక్షల నుంచి 32.80 లక్షల పంపిణీ
- బాధిత మత్స్యకారుల్లో వెల్లివిరిసిన ఆనందం

సాక్షి, విశాఖపట్నం: గత ఆదివారం అర్ధరాత్రి విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 49 బోట్లు ఆహుతయ్యాయి. వీటిలో 30 పూర్తిగా, 19 పాక్షికంగా దగ్ధమయ్యాయి. దీంతో వీటి యజమానులే కాదు.. బోట్లపైనే ఆధారపడి బతుకీడుస్తున్న మత్స్యకార కలాసీలు కూడా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. గతంలో హుద్‌హుద్, తిత్లీ, పెథాయ్ వంటి తుపానులకు దెబ్బతిన్న బోట్లకు పరిహారం చెల్లిస్తామని అప్పటి టీడీపీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఏళ్లు గడిచినా ఆ హామీకి అతీగతీ లేకుండా పోయింది. దీంతో చేసిన అప్పులు తీర్చలేక, ఆదాయం వచ్చే మార్గం లేక బాధిత మత్స్యకార కుటుంబాలు రోడ్డునపడ్డాయి. ఆదివారం నాటి అగ్ని ప్రమాద బాధితులు వీరిని గుర్తుకు తెచ్చుకుని తమకూ అలాంటి పరిస్థితే ఎదురవుతుందని, తమను ఎవరూ ఆదుకోరని ఆందోళన వ్యక్తమైంది. అయితే వారి అనుమానాలను పటాపంచలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనూహ్య నిర్ణయాన్ని తీసుకున్నారు. బోట్లకు వాటిల్లిన నష్టంలో 80 శాతం సొమ్మును పరిహారంగా ప్రభుత్వం చెల్లిస్తుందని ప్రకటించారు. అందుకు ఎంతో సమయం పడుతుందని బాధిత మత్స్యకారులు భావించారు. కానీ వెనువెంటనే నష్టాన్ని అంచనా వేయించడం, ఆపై నిధులు విడుదల కావడం, ప్రమాదం జరిగిన మూడు రోజుల్లోనే ఈ 49 మందికి రూ.7.11 కోట్ల చెల్లింపులు చకచకా జరిగిపోయాయి.

ఊహించని ఈ పరిణామానికి మత్స్యకారులు ఆశ్చర్యానికి గురయ్యారు. సీఎం వైఎస్ జగన్ తమను ఇంత వేగంగా ఆదుకుంటారని కలలో సైతం ఊహించలేదని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇలా పూర్తిగా దగ్ధమైన బోటుకు గరిష్టంగా రూ.32.80 లక్షలు, పాక్షికంగా కాలిపోయిన బోటుకు కనిష్టంగా రూ.2.40 లక్షలు చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. వీరికే కాదు ఈ బోట్లపై ఆధారపడి జీవిస్తున్న మరో 400 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున చెల్లించి బాధితుల కళ్లల్లో వెలుగులు నింపారు. సీఎం జగన్‌కు తామెప్పుడూ రుణపడి ఉంటామని వారు తమ సంతోషాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

కలలోనూ ఊహించలేదు..



అగ్ని ప్రమాదంలో నా బోటు పూర్తిగా దగ్ధమైంది. ప్రభుత్వం సాయం చేస్తుందని చెప్పినా నమ్మలేదు. ఎంతోకొంత ఇచ్చి చేతులు దులుపుకుంటుందనుకున్నాను. కానీ రూ.24.80 లక్షల పరిహారం ఇచ్చింది. ఈ సొమ్ముతో కొత్త బోటు కొనుక్కుని యథావిధిగా వేట సాగిస్తా.

- వంకా గురుమూర్తి, బోటు యజమాని, అన్నవరం, భీమిలి మండలం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం..



రూ.లక్షలు అప్పు చేసి బోటు కొనుక్కున్నాం. అప్పు తీరకుండానే బోటు కాలిపోయింది. ఎలా బతకాలోనని తిండీతిప్పలు మాని ఏడుస్తూ గడిపాం. సీఎం జగన్‌బాబు మా బోటుకు రూ.22.40 లక్షల పరిహారం ఇచ్చి మా కష్టాన్ని తీర్చాడు. ఆయనకు రుణపడి ఉంటాం.

-అర్జిల్లి అమ్మోరమ్మ, చేపల కంచేరు, విజయనగరం జిల్లా

కనీవినీ ఎరుగని స్పందన



తిత్లీ తుపానులో రూ.30 లక్షల విలువైన నా బోటు పూర్తిగా దెబ్బతింది. అప్పటి ప్రభుత్వం రూ.6 లక్షలు పరిహారం ఇస్తామని చెప్పింది. కానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. మా అన్నయ్య ఎరికోడు బోటు కాలిపోతే ఇప్పుడు రూ.7 లక్షల పరిహారం ఇచ్చారు.

- గనగళ్ల మహేష్, ముక్కాం, భోగాపురం మండలం

350 జంటలకు పెళ్లి కానుక



నూతన జంటలకు నమూనా చెక్కును అందిస్తున్న జేసీ జాహ్నవి

- వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా సాయం పంపిణీ
- రూ.2 కోట్ల 14 లక్షల 25 వేలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ

తుమ్మపాల: పేద కుటుంబాల్లో పిల్లల వివాహాలకు ప్రభుత్వ సహాయంగా వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి చెప్పారు. సీఎం జగన్ చేతుల మీదుగా అందించే కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించి జిల్లాలో లబ్ధిదారులకు చెక్కు రూపంలో ఆమె అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా ద్వారా జిల్లాలో 350 జంటలకు ఆర్థిక సాయంగా రూ.2 కోట్ల 14 లక్షల 25 వేలు ఇస్తున్నట్లు చెప్పారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లల వివాహాలకు ప్రభుత్వం కల్పిస్తున్న కళ్యాణమస్తును ప్రతి కుటుంబం వినియోగించుకోవాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి పథకాలు అందించే బాధ్యత అధికారులు తీసుకోవాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ డైజీ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అజయ్ బాబు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కరక క్వారీలో మళ్లీ తవ్వకాలు?

- గస్తీ ముమ్మరం చేసిన అధికారులు



కరక ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బంది

గొలుగొండ: కరక రంగురాళ్ల క్వారీలో తవ్వకాలు జరగకుండా అటవీశాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు. రెండు రోజుల క్రితం క్వారీ ప్రాంతాల్లో కొంతమంది సంచరించినట్టు వార్తలు రావడంతో నర్సీపట్నం అటవీశాఖ సెక్షన్ అధికారులు వెంటనే స్పందించారు. గురువారం ఉదయం నుంచి కరక రంగురాళ్ల క్వారీ వద్ద ఉన్న బేస్ క్యాంప్ సిబ్బందే కాకుండా అటవీశాఖ సిబ్బంది ముమ్మరంగా గస్తీ నిర్వహిస్తున్నారు. కరక, దోనిపాలెం, జిల్లేడిపూడి, కొత్త ఎల్లవరం గ్రామాల్లో గురువారం గ్రామ దేవతల పండగలు నిర్వహించిన నేపథ్యంలో ఎటువంటి తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు నర్సీపట్నం సెక్షన్ అధికారి సత్యనారాయణ తెలిపారు. క్వారీ ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో పండగల సందర్భంగా కొంతమంది క్వారీలో తవ్వకాలు జరిపారని వచ్చిన సమాచారంతో ముందస్తుగా నిఘా పెంచామని తెలిపారు. క్వారీ ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉందని హెచ్చరించారు.

కేకే లైన్లో డీఆర్‌ఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ గురువారం కేకే లైన్లో తనిఖీలు చేపట్టారు. ఈ పరిధిలోని పలు స్టేషన్‌లలో ఆయన తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. స్టేషన్‌లో సదుపాయాలు, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ మార్గంలో జరుగుతున్న డబ్లింగ్ పనులను పరిశీలించారు. ఈ తనిఖీలలో భద్రత, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ప్రయాణికుల సదుపాయాలు స్వయంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. త్యాడ స్టేషన్‌లో ఆధునికీకరిస్తున్న స్టేషన్ భవనం, ట్రాక్షన్, సబ్ స్టేషన్, యార్డ్ ప్లానింగ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు

తుమ్మపాల: జిల్లాలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, మినీ అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టుల్ని భర్తీ చేసేందుకు అర్హులైన ఓసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి అధికారి కె.అనంతలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి డివిజన్లో కార్యకర్త పోస్టులు-3, ఆయాలు- 37, మినీ కార్యకర్త-8తో కలిపి మొత్తం 48 పోస్టులు ఉన్నాయన్నారు. నర్సీపట్నం డివిజన్లో కార్యకర్త పోస్టులు- 6, ఆయాలు- 17, మినీ కార్యకర్త-1 కలిపి మొత్తం 24 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ ఏడాది జూలై 1 నాటికి 21 ఏళ్లు నిండి, 35 ఏళ్ల లోపు వయసు, పదో తరగతి విద్యార్హతతో, స్థానికులైన వివాహిత మహిళలు అర్హులన్నారు. ఈ నెల 24 నుంచి డిసెంబరు 4 సాయంత్రం 5 గంటల్లోగా సంబంధిత శిశు అభివృద్ధి పథకం అధికారి, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి నేరుగా/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా చేరేలా దరఖాస్తులు అందజేయాలన్నారు.

చిక్కుడుపాలెం శివాలయంలో తనికెళ్ల భరణి



ధర్మకర్త శర్మ, గ్రామస్తులతో తనికెళ్ల భరణి

నాతవరం: మారుమూల ప్రాంతంలో నిర్మిస్తున్న శివాలయాన్ని దర్శించుకోవడం ఆనందంగా ఉందని ప్రముఖ సినీనటుడు తనికెళ్ల భరణి అన్నారు. మండలంలోని చిక్కుడుపాలెం గ్రామంలో శ్రీ శివశక్తి క్షేత్రంలో భూగర్భ శివాలయాన్ని గురువారం రాత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస సౌకర్యాలు లేని గ్రామంలో ప్రపంచంలోనే భూగర్భ శివాలయంగా పేరొందిన ఆలయాన్ని దాతల సహకారంతో ధర్మకర్త శర్మ నిర్మిస్తుండటం విశేషమన్నారు. ఆలయ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం ప్రాముఖ్యత నలుదిశలా వ్యాపిస్తుందన్నారు. దైవ సంకల్పంతో కూడిన ఈ ఆలయ నిర్మాణం ద్వారా స్థానిక మరింత భక్తిభావం అలవడుతుందన్నారు. శివాలయం పూర్తిస్థాయిలో నిర్మాణమయ్యాక ఒక రోజంతా ఇక్కడే గడుపుతానన్నారు. ఆలయ నిర్మాణానికి కంకణం కట్టుకున్న శర్మను అభినందించారు. ఈ ప్రాంతానికి తొలిసారిగా తనికెళ్ల భరణి రావడంతో ఆయన్ని చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున వచ్చారు.

తండ్రి రుణం తీర్చుకుంది..

- తలకొరివి పెట్టిన కుమార్తె



తండ్రికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న సూర్యప్రభ

బుచ్చెయ్యపేట: నాన్నా వెళ్లిపోతున్నావా.. అంటూ కన్నీరుమున్నీరైంది. తలకొరివి పెట్టి తండ్రి రుణం తీర్చుకుంది. వడ్డాది గ్రామానికి చెందిన అదట్రా కొండలరావు (72) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుమారుడు 20 ఏళ్ల క్రితం మృతి చెందగా భార్య, కుమార్తె ఉన్నారు. తలకొరివి పెట్టడానికి మగవారు లేకపోవడంతో కుమార్తె నయ్యపు రెడ్డి సూర్యప్రభ తండ్రికి అంత్యక్రియలు జరిపింది. కుటుంబసభ్యుల సహకారంతో ఇంటి నుంచి శ్మశానం వరకు వెళ్లి హిందూ సంప్రదాయం ప్రకారం తండ్రికి తలకొరివి పెట్టింది.

ప్రాక్టికల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ



ప్రాక్టికల్స్ తరగతులను పరిశీలిస్తున్న ఆర్ఐవో సత్యనారాయణ

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ విద్యా క్యాలెండర్ అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో తప్పనిసరిగా విద్యార్థులతో ప్రాక్టికల్స్ నిర్వహించాలని ఆర్ఐవో రాయల సత్యనారాయణ అన్నారు. గురువారం విశాఖ నగరంలోని ఫిట్జీ జూనియర్ కాలేజీని ఆయన తనిఖీ చేశారు. కాలేజీలో సైన్సు విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రాక్టికల్స్ తరగతులను పరిశీలించారు. విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడారు. చదువులపై దృష్టి సారించి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కాలేజీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ప్రాక్టికల్స్ నిర్వహించకుంటే కాలేజీ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మువ్వన్నెల దరహాసం



విజయం మనదే..



కమాన్ ఇండియా





మేరా భారత్ మహాన్

కుర్రాళ్లు సూపర్ హిట్

విశాఖ తీరాన అభిమాన తరంగం
టీ 20 మ్యాచ్ సందర్భంగా

హోరెత్తింది. ఆ ఉరవళ్లు ఈ కార్తీకాన సందడి చేశాయి. డియర్ టీం ఇండియా.. మేమంతా మీ వెంటే.. మళ్లీ చెబుతున్నాం అభిమాన సంద్రం ఎన్నడూ చిన్నబోదు.. అని స్పష్టం చేసింది. నరాలు తెగే ఉత్కంఠ మ్యాచ్‌లో మన కుర్రాళ్లు కుమ్మేశారు. అటు ఆసీస్.. ఇటు భారత్ ఆటగాళ్లు పరుగుల వరద పారించడంతో క్రికెట్ అభిమానులు పండగ చేసుకున్నారు. ఆసీస్ బ్యాటర్ జోష్ ఇంగ్లిస్ కేవలం 47 బంతుల్లో మెరుపు సెంచరీ చేయగా.. అందుకు దీటుగా భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. 42 బంతుల్లో 80 పరుగులు చేసి ఇండియా విజయానికి బాటలు వేశాడు. ఇండియా-ఆస్ట్రేలియా టీ-20 సిరీస్‌లో తొలి మ్యాచ్ విశాఖ క్రీడాభిమానులకు మంచి కిక్ ఇచ్చింది.

- విశాఖ స్పోర్ట్స్





క్యాచ్ పడుతున్న స్టోయినిస్

స్టేడియం వెలుపల అభిమానులు



సైడ్‌లైట్స్

- ప్రపంచ కప్ ముగిసిన నాలుగు రోజుల వ్యవధిలోనే విశాఖ వేదికగా ప్రారంభమైన టీ-20 మ్యాచ్‌పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.
- ఆట ప్రారంభానికి ముందే గ్యాలరీలన్నీ నిండిపోయాయి.
- అభిమానులు తమ మోములపై త్రివర్ణ రంగులు ముద్రించుకుని.. జెండాలు పట్టుకుని ఉత్సాహం ప్రదర్శించారు.
- స్పిన్నర్‌గా కెరీర్ ప్రారంభించిన స్మిత్ ఏకంగా ఓపెనర్ గానే రూపాంతరం చెంది తొలి బంతిని ఆడాడు.
- కెప్టెన్‌గా సూర్యకుమార్, కోచ్‌గా లక్ష్మణ్‌కు ఇదే తొలి మ్యాచ్. ఆట విశ్రాంతి సమయంలో వీరిద్దరూ జట్టు సభ్యులకు పలు సూచనలిచ్చారు.
- టీ-20ల్లో కనీసం అర్ధ సెంచరీ కూడా లేని ఇంగ్లిష్ ఏకంగా 47 బంతుల్లోనే సెంచరీ చేశాడు.
- గెలిచినా ఓడినా క్రికెట్ ఫర్ ఎవర్ అంటూ పెద్ద ఎత్తున అభిమానులు ప్లకార్డులు ప్రదర్శించారు.



విన్నింగ్ షాట్



క్లుప్తంగా

జిల్లా తూనికలు, కొలతల శాఖ దాడులు

- 10 దుకాణాలపై కేసుల నమోదు



కోనాంలోని చికెన్ సెంటర్‌లో కాటాను పరిశీలిస్తున్న అధికారులు

చీడికాడ: జిల్లా తూనికల, కొలతల శాఖ అధికారులు గురువారం చీడికాడ మండలంలోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఆ శాఖకు చెందిన ఇన్‌స్పెక్టర్ భాస్కరరావు ఆధ్వర్యంలో కోనాం, ఖండివరం, అప్పలరాజుపురం, చీడికాడ, వరహాపురం గ్రామాల్లో పలు ఎరువులు, సిమెంట్, హార్డ్‌వేర్, చికెన్, కూరగాయలు, కిరాణా దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు కొలతలు, తూనికల్లో తేడాలను గుర్తించి 9 దుకాణాలపైనా, అధిక ధరలకు విక్రయాలు చేస్తున్న మరో దుకాణంపైనా కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సింహగిరిపై తిరునక్షత్రం పూజలు ప్రారంభం



తిరునక్షత్రం పూజలు నిర్వహిస్తున్న స్థానాచార్యులు, వైదికులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం నుంచి మనవాళ మహామునులు తిరుక్షత్రం పూజలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై వేంజేంపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. దివ్యప్రబంధ పారాయణం పఠించారు. విశేషంగా హారతులు సమర్పించారు. ఆలయ స్థానాచార్యుడు టి.పి.రాజగోపాల్, అధ్యాపకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శాస్త్రోక్తంగా మార్గశిర రాట మహోత్సవం



మహిళలకు అమ్మవారి జాకెట్టు ముక్క, గాజులు, తాంబూలం అందజేస్తున్న ఈవో శిరీష, చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం



మార్గశిర మాసోత్సవాల ముహూర్తపు రాట వేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ సింహాచలం

డాబాగార్డెన్స్ (విశాఖ): ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖవాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాల రాట కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఏటా కార్తీక శుద్ధ ఏకాదశి రోజున రాట వేసి మార్గశిర మాసోత్సవాలకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీ. ఆ సంప్రదాయం ప్రకారం ఉదయం 9.23 గంటలకు నాదస్వర సుస్వరాలు, వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ముహూర్తపు రాట వేసి, అమ్మవారికి విశేష పూజలు చేశారు. ముందుగా ఆయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మహిళా భక్తులకు అమ్మవారి జాకెట్టు ముక్క, తాంబూలం, గాజులు, ప్రసాదం అందజేశారు. ఇప్పటి నుంచి కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవ ఏర్పాట్లు విస్తృతం చేయనున్నారు. ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఈవో కె.శిరీష, ధర్మకర్తలు సత్య రూపవాణి, బి.అనురాధ, సుబ్రహ్మణ్యం, సతీష్, ప్రత్యేక ఆహ్వానితుడు జి.ప్రకాష్, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపమాక ఆలయానికి పోటెత్తిన భక్తులు



స్వామివారి ఉత్సవమూర్తులకు పూజలు



స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు



వడ్డాది వెంకన్నకు పూజలు

- ఘనంగా కార్తీక ఏకాదశి పూజలు

నక్కపల్లి : కార్తీక శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని గురువారం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీక మాసంలో తొలిగా వచ్చే కార్తీక శుద్ధ ఏకాదశికి బోధన ఏకాదశి, ఉత్థాన ఏకాదశి అని పేర్లు. ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున శయనించిన శ్రీమహావిష్ణువు యోగనిద్ర నుండి మేల్కొనే రోజు కాబట్టి ఉత్థాన ఏకాదశి అయింది. దీనినే హరి బోధిని ఏకాదశి అనికూడా పిలుస్తారు. తొలి ఏకాదశినాడు ప్రారంభమైన చాతుర్మాస్య వ్రతం ఈ ఏకాదశితో ముగుస్తుంది. ఈ రోజున ఉపవాసం ఉన్న భక్తులంతా విష్ణువును పూజించి రాత్రి జాగరణ చేసి మరునాడు ద్వాదశి ఘడియలు ఉండగానే విష్ణుపూజ, పారాయణ చేసి వ్రతాన్ని ముగించాలి. ఇలా ఉపవాసం ఉన్న భక్తులంతా ఉపమాక క్షేత్రానికి తరలివచ్చారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. దిగువ క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి, ఉత్సవమూర్తులకు, ఆండాళ్లమ్మవారికి నిత్యార్చనలు అభిషేకాలు నిర్వహించిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. ఉపమాకలో ప్రాచీనమైన శ్రీ భువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వర స్వామిని కూడా భక్తులు దర్శించుకున్నారు.

బుచ్చెయ్యపేట: తొలిఏకాదశి పర్వదినం పురస్కరించుకొని వడ్డాది గిరిజాంబకొండపై కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారిని దర్శించుకోవడానికి జిల్లా నలుమూలల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈవో శర్మ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ మండపంలో పూజలు నిర్వహించారు.

మళ్లీ జగనే సీఎం కావాలని ప్రచార యాత్ర



రథయాత్రకు సంఘీభావం తెలిపిన నాయకులు

పాయకరావుపేట : రాష్ట్రానికి మరలా వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని, అందుకోసం 100 రోజులు ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు యాత్ర నిర్వాహకుడు కావూరి జయకుమార్ తెలిపారు. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు 4100 కిలోమీటర్లు ఆటోపై ప్రయాణిస్తూ, ప్రచార యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యాత్రలో భాగంగా గురువారం పాయకరావుపేట చేరుకున్నారు. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గం నాగులప్పాడు మండలం ఈదుముడి గ్రామానికి చెందిన తాను వృత్తిరీత్యా పెయింటర్ అని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై సంతృప్తి చెంది మరలా జగనే సీఎం కావాలని యాత్ర ప్రారంభించడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 12 తేదీన యాత్ర ప్రారంభించడం జరిగిందన్నారు. డిసెంబర్ 21వ తేదీన జగన్ పుట్టిన రోజు నాటికి ఇచ్ఛాపురం చేరుకుంటానన్నారు. జిల్లాకు 4 రోజులు ప్రకారం 26 జిల్లాలలోను ప్రచార యాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ లంక సూరిబాబు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, మండల కోఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ, అనిశెట్టి వెంకట సూరి సంఘీభావం పలికారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం



గౌరీపట్నంలో ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- గౌరీపట్నంలో ఆర్బీకే భవనం ప్రారంభం

చోడవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన దేశానికే ఆదర్శమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని గౌరీపట్నం గ్రామంలో రూ.28 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.18 లక్షలతో నిర్మించిన హెల్త్ సెంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు అమలు చేయడంతోపాటు గ్రామ స్వరాజ్య స్థాపనకు అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి పని చేస్తున్నారని కితాబిచ్చారు. కొత్తగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడంతోపాటు అన్ని భవనాలు నిర్మించడం, శాఖలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బంది పూర్తిస్థాయిలో నియమించి ప్రజలకు సకాలంలో సేవలందిస్తుండడంతో దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు. ప్రాథమిక వైద్యం అందించేందుకు సచివాలయ పరిధిలోనే హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేశారన్నారు. వ్యవసాయ సేవలకు రైతు భరోసా కేంద్రాలు, పంటల నిల్వలకు మినీ కోల్డ్ స్టోరేజీలు నిర్మించి రైతులకు అండగా నిలిచారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు పూర్తిగా మద్దతు తెలపాలని కోరారు. గ్రామ సర్పంచ్ కోన చంద్రరావు, ఎంపీటీసీ మంగ జగన్నాథరావు, ఏపీపీ ఉగ్గిన వెంకట్రావు, ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, డీసీసీబీ డైరెక్టర్ మూడెడ్ల శంకరరావు, పార్టీ మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య తదితరులు పాల్గొన్నారు.

చెప్పినవన్నీ చేశాం.. ఆశీర్వదించండి

- నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ఎన్నికల హామీలన్నీ నెరవేర్చాం.. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా నర్సీపట్నం మండలం వేములపూడి గ్రామ సచివాలయంలో గురువారం ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రూ.43.60 లక్షలతో సచివాలయం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద కార్యాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రాల చుట్టూ తిరిగే పనిలేకుండా గ్రామస్థాయిలో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చామన్నారు. వీటి ద్వారా ప్రభుత్వ సేవలను అందిస్తున్నామన్నారు. జగనన్న ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేస్తున్న సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చాక నెరవేర్చారన్నారు. పేదలు తమ పిల్లలను చదివించుకునేందుకు అమ్మ ఒడి, రైతుల పెట్టుబడి కోసం రైతు భరోసా, అవ్వతాతలకు వైఎస్సార్ పింఛన్ కానుకతోపాటు మరెన్నో పథకాలతో ప్రతి ఇంటికీ ఆర్థిక లబ్ధి చేకూర్చారన్నారు. పారదర్శక పాలన అందిస్తున్న జగన్‌ను ముఖ్యమంత్రిగా మరోసారి ఎన్నుకోవాల్సిన అవసరముందని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, వైస్ ఎంపీపీ తాతబాబు, పార్టీ సీనియర్ నాయకుడు బోళెం నర్సింహమూర్తి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మురళీ, మండల సచివాలయాల కన్వీనర్ చినబాబు, నాయకులు గుడివాడ లోవరాజు, ఎంపీడీవో జయమాధవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



మంటల్లో దగ్ధమైన పూరిల్లు

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం
- రూ.2.50 లక్షల ఆస్తి నష్టం

యలమంచిలి : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెదపల్లి గ్రామంలో ఒక పూరిల్లు దగ్ధమైంది. యలమంచిలి అగ్నిమాపకశాఖ అధికారి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం యలమంచిలి మున్సిపాలిటీ పెదపల్లి గ్రామంలో రామాలయం వద్ద గురువారం ఉదయం బొద్దపు నాగేశ్వరరావు, దాసరి నాగరాజు, బొద్దపు లోవతల్లికి చెందిన పురిల్లు లోపల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాప్తి చెంది దగ్ధమైంది. స్థానికులు సమాచారం మేరకు అగ్నిమాపకశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.2.50 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు. బొద్దపునాగేశ్వరరావు, దాసరి నాగరాజు, బొద్దపు లోవతల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని అగ్నిమాపకశాఖ అధికారి రాంబాబు తెలిపారు. ఈ ప్రమాదంలో విలువైన ఇత్తడి సామాన్లు, ఫ్యాన్లు, దుస్తులు, ఎలక్ట్రికల్ సామాన్లు, చెక్కసామాన్లు అగ్నికి ఆహుతి అవడం వలన కట్టుబట్టలతోనే నిరాశ్రయులుగా మిగిలిపోయారు.

బస్సును ఢీకొట్టిన రెడీమిక్స్ వాహనం



ప్రమాదంలో ధ్వంసమైన రెడీమిక్స్ వాహనం



గాయపడిన కార్మికులను పరామర్శిస్తున్న సీఐటీయు నాయకుడు

- కార్మికులకు గాయాలు

అచ్యుతాపురం (అనకాపల్లి): మండలంలోని కుమారపురం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారస్ కార్మికులు గాయాలపాలయ్యారు. సెజ్‌లోని లారస్ 2 యూనిట్‌లో పనిచేస్తున్న కార్మికులు విధులు ముగించుకొని బస్సులో ఇంటికి వెళుతున్న క్రమంలో పెట్రోల్ బంక్ వైపు వెళుతున్న శర్వాణి రెడీమిక్స్ వాహనం ఢీకొట్టింది. 11 మందికి గాయాలు కాగా విశాఖ కిమ్స్ ఆస్పత్రిలో కొందరికి, అచ్యుతాపురం ఆస్పత్రిలో మరికొందరికి చికిత్స అందిస్తున్నారు. వారిని సీఐటీయూ నాయకుడు ఆర్.రాము పరామర్శించారు. ఈ ప్రమాదంపై బస్సు డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీరావు తెలిపారు.

సత్యసాయి మార్గం అనుసరణీయం

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



దాత సత్యవతితో కలిసి బాలికల విభాగాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

పెందుర్తి: భగవాన్ సత్యసాయి బాబా సేవా మార్గం ప్రతీ ఒక్కరికీ అనుసరణీయమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. జీవీఎంసీ 88వ వార్డు నరవలోని భగవాన్ సత్యసాయి ఆరాధన హోమ్‌లో దాత, సత్యసాయి భక్తురాలు లోవ సత్యవతి సమకూర్చిన రూ.20 లక్షల నిధులతో బాలికల విభాగం భవనాన్ని నిర్మించారు. సత్యసాయి జన్మదినోత్సవం సందర్భంగా ఆ భవనాన్ని గురువారం బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా ప్రారంభించారు. అనాథ పిల్లల కోసం తన ఆస్తిలోని కొంత మొత్తాన్ని భవన నిర్మాణానికి వినియోగించిన సత్యవతి సేవలు హర్షణీయమన్నారు. అనంతరం దాత సత్యవతిని ఘనంగా సత్కరించారు. దాదాపు 400 మంది నిరుపేదలకు ముత్యాలనాయుడు చేతుల మీదుగా దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు నాయుడు, సింహాచలం సమితి కన్వీనర్ చప్ప అక్కునాయుడు, వేపగుంట భజన మండల కన్వీనర్ మల్లా జగదీష్, వైఎస్సార్ టీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు, ఆరాధన హోం నిర్వాహకులు విశ్వసాయి గురూజీ, ప్రియ బాంధవి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ కేంద్రం పరిశీలన



సిబ్బందికి సూచనలు అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : పంచగ్రామాల్లో ఇళ్ల మరమ్మతుల కోసం సింహాచలంలోని శ్రీదేవి కాంప్లెక్స్‌లో దేవస్థానం ఏర్పాటు చేసిన దరఖాస్తులు జారీ , స్వీకరణ కేంద్రాన్ని గురువారం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పరిశీలించారు. కేంద్రాన్ని బుధవారమే ఏర్పాటు చేయగా దేవదాయశాఖ ఉన్నతాధికారుల పిలుపు మేరకు ఈవో అమరావతి మీటింగ్‌కి వెళ్లడంతో అందుబాటులో లేరు. దీంతో గురువారం ఈవో కేంద్రానికి వచ్చి దరఖాస్తుల జారీ , స్వీకరణ ప్రక్రియలను పరిశీలించారు. సిబ్బందికి తగిన సూచనలు అందజేశారు. దరఖాస్తు దారులతో మాట్లాడారు. పది నుంచి ఇరవై రోజుల్లో దరఖాస్తు దారులకు వారి దరఖాస్తు స్టేటస్ తెలుస్తుందని తెలియజేశారు. కాగా గురువారం 93 దరఖాస్తులు రాగా, 63మంది పూర్తి చేసిన దరఖాస్తులను అందజేశారు.

2047 నాటికి సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలన



థింసా నాట్యం చేస్తున్న అడిషనల్ సెక్రెటరీ జయ

- రాష్ట్ర ప్రభుత్వ చర్యలు ప్రశంసనీయం
- గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి జయ



కార్యక్రమం ప్రారంభిస్తున్న అడిషనల్ సెక్రెటరీ జయ

కొమ్మాది: ప్రధానమంత్రి సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్ 2047 లక్ష్య సాధనకు అందరం కృషి చేద్దామని భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ఆర్.జయ పిలుపునిచ్చారు. రుషికొండలోని గిరిజన సాంస్కృతిక శిక్షణ మిషన్ భవన్‌లో గురువారం జరిగిన గిరిజన స్వాభిమాన ఉత్సవాల్లో ఆమె మాట్లాడారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన.. అవగాహన, కౌన్సెలింగ్ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఎనీమియా, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి ఒకటి కాదన్నారు. సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. గిరిజన ఆరోగ్యం, మౌలిక వసతి కల్పనకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కళాకారులతో కలిసి ఆమె థింసా నృత్యం చేశారు. గిరిజన కళాకారుల జానపద నృత్యాలు, హస్తకళలు, గిరిజన వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ జె.వి.మురళి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చినబాబు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స



శస్త్ర చికిత్సతో పొట్టమీద వాపు తొలగించిన దృశ్యం

మహారాణిపేట: కేజీహెచ్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. పేగు క్యాన్సర్‌కు శస్త్రచికిత్స చేసుకున్న కెల్లా రామకృష్ణకు ఇన్‌సిషనల్ హెర్నియా అనే అరుదైన వ్యాధి సోకింది. కేజీహెచ్ జనరల్ సర్జరీ ఎస్–5 ఇన్‌చార్జి డాక్టర్ బి.తేజేశ్వరరావు మూడు గంటల పాటు శ్రమించి ఆయనకు శస్త్ర చికిత్స చేశారు. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న కెల్లా రామకృష్ణకు పేగు క్యాన్సర్ సోకడంతో కొన్నేళ్ల కిందట శస్త్రచికిత్స జరిగింది. ఆ తర్వాత ఆయనకు ఇన్‌సిషనల్ హెర్నియా అనే వ్యాధి సోకింది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చూపించాడు. ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతుందని చెప్పడంతో అక్టోబర్ 27న కేజీహెచ్ వైద్యులను సంప్రదించాడు. ఎస్5 యూనిట్ చీఫ్ డాక్టర్ బి.తేజశ్వరరావు ఆయన్ని పరీక్షించి.. పలు రకాల స్కాన్‌లు చేశారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఈ నెల 8న డాక్టర్ తేజేశ్వరరావు మూడు గంటల పాటు శ్రమించి రామకృష్ణకు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. అప్పటి నుంచి ఎస్5 వార్డులో ఆయనకు చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యం కుదుటపడటంతో కుట్లు తొలగించామని, త్వరలోనే డిశ్చార్జ్ చేస్తామని డాక్టర్ తెలిపారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఆర్ఎంవో డాక్టర్ జగదీష్, యూనిట్ చీఫ్ డాక్టర్ తేజేశ్వరరావుకు రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

క్లుప్తంగా

గవరపేట రామాలయంలో ఏకాహం



రామాలయం వద్ద ఏకాహంలో పాల్గొన్న భక్తులు

కశింకోట: స్థానిక గవరపేటలోని శారదా గణపతి రామాలయంలో కార్తీక మాసం తొలి ఏకాదశి పురస్కరించుకు 24 గంటల భజన కార్యక్రమం(ఏకాహం)ను గురువారం చేపట్టారు. హరే రామ హరే రామ.. రామ రామ హరే హరి, హరే కృష్ణ హరే కృష్ణ.. కృష్ణ కృష్ణ హరే హరే అంటూ నారాయణుడి నామ స్మరణతో మునిగితేలారు. ఎక్కువ మంది మహిళా భక్తులు హాజరయ్యారు. ఏకాహం శుక్రవారం ఉదయం వరకు కొనసాగనుందని ఆలయ కమిటీ చైర్మన్ భీశెట్టి దుర్గా నాగేశ్వర రావు తెలిపారు.

భారత రాజ్యాంగంపై అవగాహన తప్పనిసరి



కేజీబీవీలో విద్యార్థులతో రేబాక మధుబాబు

కశింకోట: భారత రాజ్యాంగం పట్ల సమగ్ర అవగాహన కలిగి ఉండాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు అన్నారు. మండలంలోని తేగాడలో ఉన్న కస్తూర్బాగాంధీ విద్యాలయంలో గురువారం భారత రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కేజీబీవీ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మరో సభ్యుడు ఎం.అప్పలరాజు, జీసీడీవో పద్మావతి, ప్రిన్సిపాల్ డి.చంద్రకళ, పీఈటీ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం, ప్రశాంతత



తీడ పాఠశాలలో విద్యార్థులకు మందులు అందిస్తున్న ఆయుర్వేద వైద్యాధికారి లావణ్య

కశింకోట: ఆరోగ్య సంరక్షణకు ప్రతి ఒక్కరూ యోగా ఆచరించాలని కన్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి వైద్యాధికారి కె.లావణ్య కోరారు. మండలంలోని తీడ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉచిత ఆయుర్వేదిక్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులను పరీక్షించి వ్యాధి నిరోధక శక్తి పెంచే మందులు అందించారు. యోగాసనాలు వేయించి విద్యార్థులకు యోగా పట్ల అవగాహన కలిగించారు. యోగా వల్ల శారీరక ఆరోగ్యంతోపాటు, మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. ఆయుర్వేద వైద్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఈ వైద్యంతో సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవన్నారు. యోగా ఉపాధ్యాయులు, స్కూలు సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ఆదికేశవ	: రాజా
మా ఊరి పొలిమేర-2	: సత్యనారాయణస్క్రీన్-1
స్పార్క్	: సత్యనారాయణస్క్రీన్-2
జిగర్ తండ	: షిర్డిసాయి
కోటబొమ్మాళి	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
సౌండ్‌పార్టీ	: శ్రీసత్య
మంగళవారం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 20 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-5 యూనిట్లు, బీ నెగిటివ్-1యూనిట్, ఓ పాజిటివ్-5 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 467 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 491 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



విత్తు నుంచి విక్రయం వరకు..

అండగా ఆర్బీకేలు

వ్యవసాయాన్ని పండగలా మార్చిన సీఎం జగన్

ఆర్బీకేల ఏర్పాటుతో వ్యవసాయదారులకు నిశ్చింత

గత ప్రభుత్వం వ్యవసాయం దండగ అంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయం పండగలా మారింది. రైతు పక్షపాతిగా సీఎం జగన్ వ్యవసాయానికి అన్ని విధాలా సహాయసహకారాలు అందించారు. పెట్టుబడి సాయం, సరిపడా విత్తనాలు, ఎరువులు.. ఇలా రైతు ప్రతి అవసరాన్నీ గుర్తించారు. రైతు ముంగిటే సకల సేవలూ అందేలా ఆర్బీకేలను స్థాపించారు.



క్షేత్ర స్థాయిలో వరి పొలాల పరిశీలన



మట్టి పరీక్షలపై రైతులకు అవగాహన



పంట పొలాల్లో వరి నూర్పిడి చేస్తున్న యంత్రం



నూతలగుంటపాలేనికి చెందిన గంజి చిలుకునాయుడికి వ్యవసాయమే ఆధారం. కౌలుకు భూములను తీసుకుని వరి పంట సాగు చేస్తుంటారు. వచ్చే ఆదాయం పెట్టుబడి, కౌలు చెల్లించడానికే సరిపోని పరిస్థితి. అయినా వ్యవసాయంపై మక్కువ, అది తప్ప మరోపని తెలియక సాగులోనే ఉంటున్నారు. కౌలు రైతు కావడంతో గతంలో రైతు భరోసా వచ్చేది కాదు. ఈ ఏడాది తొలిసారిగా రైతు భరోసా రూ.11,500 అందజేశారు. దీంతో చిలుకునాయుడు ఆనందం చెప్పలేనంత. తమ కుటుంబానికి, ధైర్యంగా సాగు చేసేందుకు సీఎం జగన్ కొండంత భరోసానిచ్చారని కృతజ్ఞతలు తెలిపారు.



కశింకోటలోని 3వ ఆర్బీకేలో సత్యమాంబ కస్టమర్ హైరింగ్ కేంద్రానికి రూ.5.40 లక్షలతో ప్రభుత్వం వరి నూర్పిడి యంత్రాన్ని అందించింది. రూ.2 లక్షల రాయితీ ఇచ్చింది. వెలంపేటకు చెందిన రైతు డోకుల వెంకటసూర్యనారాయణ దీన్ని నిర్వహిస్తున్నారు. వరి నూర్పిడికి గంటకు రూ.1600 అద్దెగా వసూలు చేస్తున్నారు. ఇది లాభదాయకంగా ఉంది. మండలంలో ఒకటే యంత్రం ఉండటంతో నూర్పిడి సమయంలో భారీ డిమాండ్ ఉంటోంది. కూలీలు దొరకని సమయంలో ఎంతగానో ఉపయోగపడుతోంది. తమకు ఇదే పెద్ద ఆసరా అని ఆనందంగా చెప్పున్నారు.

కశింకోట మండలంలో..

మండలంలో ఆర్బీకేలు	సొంత భవనాలున్నవి	ప్రారంభానికి సిద్ధమైనవి	నిర్మాణంలో ఉన్న భవనాలు	ఒక్కో భవనానికి వ్యయం	కస్టమర్ హైరింగ్ కేంద్రాలు
9	2 (ఉగ్గినపాలెం, తేగాడ)	2 (వెదురుపర్తి, ఏఎస్ పేట)	2 (అచ్చెర్ల, నూతలగుంటపాలెం)	రూ. 21.80 లక్షలు	12

కశింకోట:

గ్రామస్థాయిలో ప్రభుత్వానికి, రైతులకు మధ్య వారధి రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే). విత్తు నుంచి విక్రయం వరకు అవసరమైన అన్ని రకాల సేవలు ఆర్బీకేల ద్వారా రైతులకు అందుబాటులోకి వచ్చాయి. విత్తుకు ముందు భూసారం తెలుసుకోవడంలో, పంటలను ఆశించే తెగుళ్ల నివారణలో ఆర్బీకేల సిబ్బంది అందించే సేవలు అమూల్యం. రైతు బాంధవుడిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిపినవి ఆర్బీకేలే.



ఆర్బీకేల్లో అందుతున్న సేవలు

పంటల సాగులో రైతులకు సలహాలు–సూచనలు, రాయితీ ధరలకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల సరఫరా, ఇన్‌పుట్ సబ్సిడీలు, కౌలు రైతు కార్డుల జారీ, వాటి ద్వారా రుణాల మంజూరుకు సిఫార్సు, పంటల బీమాలో ఈ క్రాప్, ఈకేవైసీనమోదు, విత్తనాల సేకరణ, మద్దతు ధరకు పంట కొనుగోళ్లు, రైతు గ్రూపుల పర్యవేక్షణ, హైరింగ్ కేంద్రాల ద్వారా వ్యవసాయ పరికరాలు, కియోస్కుల ద్వారా ఆన్‌లైన్ సేవలు, పొలంబడి, పంట ప్రయోగాలు ఇలా.. విత్తు నుంచి విక్రయం వరకు అన్ని రకాల సేవలను ఆర్బీకేలు అందిస్తున్నాయి.

రైతుకు బాసటగా సిబ్బంది

ఆర్బీకేల్లో వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ సహాయకులను నియమించారు. వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు 12 మంది ఉన్నారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా సుమారు 9 వేల మందికి పైగా రైతులకు రైతుభరోసా, కిసాన్ భరోసా నిధులు రూ.60 కోట్లు మంజూరైంది. ప్రతి సచివాలయంలో ఐదుగురు రైతులు ఓ గ్రూపుగా కస్టమర్ హైరింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, వరి నూర్పిడి యంత్రాలు, నాగళ్ల సెట్లు తదితర పనిముట్లను రాయితీపై అందించడంలో సిబ్బంది కృషి ప్రశంసనీయం.

తొలగిన ఇబ్బందులు



గతంలో విత్తనాలు, ఎరువుల కోసం కశింకోట, అనకాపల్లి వెళ్లాల్సి వచ్చేది. నాణ్యమైన సరకు దొరికేది కాదు. పైపెచ్చు రవాణా ఖర్చులు తడిసిమోపెడు. ఇప్పుడు రైతు భరోసా కేంద్రంలో అన్నీ లభిస్తున్నాయి. ఎక్కడికీ వెళ్లాల్సిన పనిలేదు. ఎంతో ఆనందంగా ఉంది.

–కోన నాగమణి, మహిళా రైతు, ఉగ్గినపాలెం

సస్య రక్షణలో భరోసా



సస్య రక్షణలో ఆర్బీకే సిబ్బంది చాలా సాయం చేస్తున్నారు. పంట పొలాల్లోకి వచ్చి, పంటలను పరిశీలించి వాటి సంరక్షణకు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. దీనివల్ల పంటలను రక్షించుకోగలుగుతున్నాం. ఆర్బీకేలతో సీఎం జగన్ రైతులకు చేసిన మేలు చాలా గొప్పది.

– వేగి శ్రీనివాసరావు, రైతు, కశింకోట.



వెదురుపర్తిలో యంత్రం ద్వారా వరి నాట్లు



పొలాల్లో విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన



రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాల పంపిణీ

సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాల అభ్యున్నతి



తుమ్మపాలలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న దంతులూరి దిలీప్‌కుమార్, గొర్లి సూరిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న దంతులూరి దిలీప్‌కుమార్



తాళ్లపాలెం-1 సచివాలయంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన ఎంపీపీ, స్థానిక నాయకులు

- 'వై ఏపీ నీడ్స్ జగన్'కార్యక్రమాల్లో నాయకులు

తుమ్మపాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకున్నారని ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. మండలంలోని తుమ్మపాల గ్రామ సచివాలయం వద్ద ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. కార్యకరమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబుతో కలిసి పార్టీ జెండాను, సంక్షేమ లబ్ధి వివరాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవరత్నాలతోపాటు ప్రజలకు అవసరమయ్యే ప్రతీదీ పథకాల రూపంలో అందించి, ప్రజలకు భరోసా అందించడమే సీఎం జగన్ ఆశయమన్నారు. ఐదేళ్ల కిందట ఉండేందుకు ఇళ్లు కూడా లేని పేదలు, తమ ప్రభుత్వంలో సొంతిళ్లు, వృత్తి పరంగా ఆర్థిక ఆసరా పొందినట్లు వెల్లడించారు. జగన్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, అందుకే మళ్లీ మళ్లీ జగనే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. అంతకు ముందు ఇంటింట ప్రచారంలో భాగంగా గ్రామ ప్రజలతో మాట్లాడి, సంక్షేమ పథకాల బ్రోచర్లను అందించారు. మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవిందతో కలిసి మా నమ్మకం నువ్వే జగన్ కిట్లను వలంటీర్లకు పంపిణీ చేశారు. సాయంత్రం పంచాయతీ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి చంద్రశేఖర్ కుమారి, అన్నపూర్ణ బ్యాంక్ చైర్మన్ పీడీ గాంధీ, ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, పన్నీర్ వెంకటలక్ష్మి, వడ్డాది భారతీఅశోక్, దంతులూరి కళ్యాణ్ చక్రవర్తి, పడాల గణపతి, వైస్ సర్పంచ్ చదరం చిన్న, స్కూల్ కమిటీ చైర్మన్ గొంతిన శ్రీను, సూరిబాబు, కనుబుద్ది శంకరరావు, అర్జున్ రావు, షరీఫ్, లహరి తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని బవులవాడలో సీతమ్మకాలనీ నుంచి చోడవరం మెయిన్ రోడ్ వరకు సీసీ రోడ్డు పనులను ఎంపీపీ గొర్లి సూరిబాబు ప్రారంభించారు. జీజీఎంపీ నిధులు రూ.20 లక్షలతో ఈ రోడ్డు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు మజ్జి వెంకట అప్పారావు, ఏఎంసీ డైరెక్టర్ దాడి కుమార్, రామకృష్ణ, ఎంపీటీసీ తోటాడ విజయ్ పాల్గొన్నారు.
- మండలంలోని సీతానగరం జెడ్పీ హైస్కూల్‌ను ఎంపీపీ గొర్లి సూరిబాబు సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు పలు సబ్జెక్టులపై ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. విద్య కోసం ప్రభుత్వం అధిక నిధులు వెచ్చిస్తోందని, ఉపాధ్యాయులు మరింత చొరవతో విద్యా బోధన సాగించాలని కోరారు. జగనన్న గోరుముద్ద వంటలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ జంపన శివాజీవర్మ, సచివాలయం కన్వీనర్ పాలమరశెట్టి నర్సింగరావు, ఆడారి సూరి అప్పారావు పాల్గొన్నారు.

కశింకోట: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సీఎం జగన్ విశేష కృషి చేస్తూ ప్రజల హృదయాల్లో స్థానం పదిలం చేసుకున్నారని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. మండలంలోని తాళ్లపాలెం సచివాలయం -1లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో నాలుగున్నరేళ్లలో రూ.20.34 కోట్లతో అమలు చేసిన పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై రూపొందించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక వైపు ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. మారుమూల ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు నిర్మిస్తూ అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు మాట్లాడుతూ జగన్ మళ్లీ సీఎం కావడానికి ప్రజలు తమ సంపూర్ణ మద్దతు అందించాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, వైస్ ఎంపీపీ నమ్మి మీనా, ఎంపీటీసీ సభ్యులు లగిశెట్టి భవాని, అద్దంకి సతీష్, మాజీ సర్పంచ్ చిన్ని వల్లభనారాయణరావు, పార్టీ నాయకులు లగిశెట్టి గణేష్, ఇందలి ముసిలి నాయుడు, చిన్ని రాజీవ్, కర్రి గోవింద, ఎంపీడీవో వి.వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా లక్ష్మీనారాయణుల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గౌరీపంచాయతన దేవాలయంలో గురువారం ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీలక్ష్మీ నారాయణ కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం ఎదురు సన్నాయిమేళం, తాంబూలం మార్పిడి కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు గోపాలకృష్ణ శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి తరపున ఆలయ అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసిరావు, కార్యదర్శి బుద్ద రమణాజీ దంపతులు, అమ్మవారి తరపున మళ్ల అప్పలనాయుడు, మళ్ల సురేష్, మళ్ల వెంకట అప్పలనర్సింహం దంపతులు పాల్గొని, కల్యాణం జరిపించారు. కల్యాణం తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

- గ్రేటర్ విశాఖ విలీన గ్రామం సిరసపల్లి చింతామణి దత్తక్షేత్రంలో రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించినట్లు క్షేత్రం నిర్వాహకులు ఆంజనేయరాజు తెలిపారు. సాయంత్రం క్షేత్రంలో ఆకాశదీపం, ఓం ఆకారంలో దీపాల అలంకరణ ఆకట్టుకున్నాయి.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు



వేద పారాయణంలో పాల్గొన్న సాయి భక్తులు

అనకాపల్లిటౌన్/తుమ్మపాల: పట్టణంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. గాంధీనగరం పాతకోర్టువీధిలో సత్యసాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సత్యవ్రతాలు నేత్రపర్వంగా జరిగాయి. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. సాయంత్రం వేదపారాయణలో భక్తులు పాల్గొన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న శ్రీసత్యసాయిని ఎంపీ బీవీ సత్యవతి దంపతులు దర్శించుకున్నారు. సమితి సభ్యులు ఎంపీ దంపతులను ఘనంగా సత్కరించారు.

కశింకోట: స్థానిక కోమటి వీధి సత్యసాయి మందిరంలో జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నగర సంకీర్తన, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన, సత్యసాయి భజన మండలి ప్రతినిధులచే భజన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మందిరం నిర్వాహకుడు ముక్కా అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు నడిపల్లి గంగాభవాని పాల్గొన్నారు.

'మహాధర్నా' పోస్టర్ ఆవిష్కరణ

కశింకోట: విజయవాడలో ఈ నెల 27, 28 తేదీల్లో జరగనున్న మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు కోరారు. కశింకోటలో గురువారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ మహాధర్నాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి కార్మిక శక్తి ప్రాధాన్యత ఏపాటిదో తెలియజేసేలా ఈ ధర్నా జరగనుందన్నారు. అనంతరం మహాధర్నాపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్మిక, రైతు, ప్రజా సంఘాలు, సామాన్య ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

కనకదుర్గమ్మ చండీయాగ మహోత్సవాలు



కనకదుర్గ అమ్మవారి ఊరేగింపులో భక్తులు

తుమ్మపాల: పట్టణంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి చండీయాగ మహోత్సవాలు ఈ నెల 22 నుంచి వచ్చే ఏడాది జనవరి 4 వరకు 50 రోజులపాటు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ అధ్యక్షులు కాండ్రేగుల శ్రీరామ్, మద్దాల శ్రీను తెలిపారు. గవరపాలెం శ్రీ గంగ పరదేశమ్మ భవానీ భక్తుల ఆధ్వర్యంలో గురువారం మెయిన్ రోడ్డు నుంచి అమ్మవారిని మేళతాళాలు, మంగళవాద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి, నిలుపు మహోత్సవం జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారికి కుంకుమ పూజలు, ఊంజల్ సేవ, 108 కలశాలతో అభిషేకం, లక్ష్మీపూజ, అగ్నిగుండం, దీపారాధన, మహంకాళి హారతి, దుర్గా హారతి పూజ, మహా నైవేద్యం, తోడుపెద్దు సేవ తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కె.సుబ్బు, కె.వెంకట్, బి.వర, వి.మహేష్, ఎం.గోపి, బి.ఆది, ఎం.సుబ్బు, పి.యుగంధర్, కె.సాంబ, బి.గంగాధర్, డి.కుమార్, కె.శంకరరావు, ఎం.నగేష్, శ్రీ గంగ పరదేశమ్మ ఆశ్రమ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఉమా రామలింగేశ్వరుని వార్షిక కల్యాణం



శిరిడీసాయి సన్నిధిలో దాడి రత్నాకర్

తుమ్మపాల: పట్టణంలోని శారదానది ఒడ్డున వెలసిన ఉమా సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని దివ్య వార్షిక కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు సాలిగ్రామ రఘుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవానికి వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందె నాగేశ్వరరావు, సాయి సత్యదేవి దంపతులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

స్థానిక గవరపాలెం శ్రీ సత్యసాయి మందిరంలో సత్యసాయి 98వ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న రత్నాకర్ అన్నసమారాధనను ప్రారంభించారు. బాబా జయంతిని పురస్కరించుకుని 8 రోజుల పాటు సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ వేడుకల్లో కమిటీ చైర్మన్ అడ్లబోయిన నారాయణరావు, ప్రధాన కార్యదర్శి జెట్టి సూరిబాబు, సహాయ కార్యదర్శులు పలకా చంటి, కోరిబిల్లి నాగరాజు, సభ్యులు మళ్ల సాయి, యల్లపు మాధవరావు, సాయిరాం, కొణతాల మహేశ్వరరావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి వినతి



డీఎస్పీ సుబ్బరాజుకు వినతి పత్రం అందిస్తున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక సభ్యులు

తుమ్మపాల: అనకాపల్లి డివిజన్‌లో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డీఎస్పీ సుబ్బరాజుకు గురువారం వినతిపత్రం అందించారు. ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ చిన్నియాదవ్, ప్రధాన కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్‌కుమార్‌లు మాట్లాడుతూ గంజాయి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం, బెట్టింగ్‌లు, అమ్మాయిలపై ఆకతాయి చేష్టలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో విద్యార్థులు గ్రూపులుగా ప్రవేశించి, గొడవలకు దిగుతున్నారని తెలిపారు. డీఎస్పీ స్పందించి లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ సీఐలకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక కోశాధికారి బొడ్డు సోమరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు ముగడా అప్పారావు, పల్లా సత్య అప్పారావు, భరణికాన సూరిబాబు, ఉప్పల సాయి పాల్గొన్నారు.

వ్యవసాయంపై అవగాహన

సబ్బవరం: మండలంలోని మొగలిపురంలో గురువారం గ్రామీణ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కింజరాపు ఎర్రంనాయుడు వ్యవసాయ కళాశాల(ఎచ్చెర్ల) విద్యార్థులు మొబిలిటీ యాప్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శిక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సభ్యులు రైతులకు పలు సూచనలిచ్చారు.